


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

(గత సంచిక తరువాయి)

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

# చివరి విడత: మలి సందడి (27)

*స్నేహానంద లహరి*

తమాయించుకుందుకు కొద్ది క్షణాలు పట్టింది.

"నేను చంపేయడమేమిటి? నువ్వు దెబ్బ తినడమేమిటి? నీ మాటలు నాకర్థం కావడంలేదు" అన్నాను.

దెబ్బ తిన్న లక్షణాలు సుందరం మొహంలో ఇంకా కనబడుతూనే ఉన్నాయి. "సైంటిస్టు సుబ్బు విషయంలోనూ ఇలాగే జరిగింది. ఇంటిపేరునిబట్టి మావాళ్లే అనుకున్నాను. కానీ ఆరువేల నియోగిగా తేలాడు" నెమ్మదిగా అని భారంగా నిట్టూర్చాడతడు.

తెల్లబోయాను. ఐతే ఇంత కాలం అతడు నాతో సన్నిహితంగా మసలుతున్న కారణం – కేవలం ఇదా?

సుందరం గురించి అలా అనుకుందుకు మనసొప్పలేదు. కానీ అతగాడే స్వయంగా అన్నప్పుడు కాదని మాత్రం ఎలా అనుకోగలను?

సుందరానికి ఇవ్వాల్సిన ఆతిథ్యం గురించి నేను, శ్రీమతి ఎన్ని రోజులు ఎంతగా ఆలోచించాం. అతడు మా వాడనుకునే కదా!

కానీ ఉన్నట్లుండి అతగాడు 'మావాళ్లు' అనే పదానికి మరో అర్థం చెప్పాడు. నన్నిప్పుడు తనవాడిగా అనుకుందుకు సిద్ధంగా లేనట్లు సూచిస్తున్నాడు.

ఏం మాట్లాడాలో తెలియలేదు కానీ, ఏదో ఒకటి మాట్లాడక తప్పని పరిస్థితి.

ఏం మాట్లాడినా అతిథిగా అతడికి నొప్పి తగులకూడని విధంగా ఉండాలి.

"నా కులం, శాఖ మా నాన్నగారి ద్వారా సంక్రమించింది. ఇప్పుడు నీ ముఖంలో నిరుత్సాహం చూస్తుంటే, మా నాన్నగారు కూడా మీవాళ్లే అయుంటే ఎంత బాగుండేది – అనిపిస్తోంది" అన్నాను.

అది వ్యంగ్యం కాదు. కానీ అప్పుడు ఇంకేమనాలో నాకు తోచలేదు.

సుందరం వెంటనే, "నేను ఫలానా అని నీకూ ముందే తెలియదు కదూ!" అన్నాడు కొంచెం ఆశగా.

ఆ గొంతులో ఆశ అప్పటి అతడి మానసిక స్థితిని ప్రతిఫలించింది. ఆ ఆశకు కారణమూ ఉంది.

అప్పటికే సుందరం ఆలోచనలు వాస్తవానికి వస్తున్నట్లున్నాయి. అతగాడిపట్ల నేను, మా కుటుంబం చూపిన శ్రద్ధాసక్తులు చెప్పుకోతగ్గవి. అందుకు కారణం, నేనతణ్ణి 'మావాళ్లు' అనుకోవడంవల్ల అని తేలితే, అంతకుముందు తనన్న మాటలు మానవసహజం అనుకునేందుకు అవకాశం పెరుగుతుంది.

అలాగైనా మనసుకి కొంత సద్ది చెప్పుకోవాలని అతడి ఆశ!

ఆ ఆశని నేను పసి కట్టకపోలేదు. కానీ అతడి ఆశలమీద నీళ్లు జల్లినట్లు ఔతుందని తెలిసినా, నిజాన్ని దాచదల్చుకోలేదు.

"బాబూ – నా పీహెచ్‌డీ గైడు ఇంటి పేరూ, నీ ఇంటి పేరూ కూడా ఒకటే! అందుకని నువ్వు ఫలానా అని నాకు మొదట్నించీ తెలుసు. కానీ నా గైడు నన్ను కానీ, నేనాయన్ని కానీ 'మావాళ్లు' కాదని అనుకున్న సందర్భం లేదు. ఇప్పటికీ నా బాగోగుల గురించి విచారించే ఆత్మీయుడాయన. అందుకని ఆ ఇంటి పేరు నాకు ఆత్మీయతాభావాన్నే స్ఫురింపజేస్తుంది. ఆ భావమే నీకూ విస్తరించింది" అన్నాను.

తన ఆశ ఫలించకపోయినా కూడా, అప్పటికి సుందరం తన నిరాశనుంచి తేరుకుని, పూర్తిగా వాస్తవంలోకి వచ్చాడు. "ఛా, మావాళ్లని నేనన్నానంటే, నా ఉద్దేశ్యం అది కాదు. మనవాళ్లు మనవాళ్లని ఊరికే తాపత్రయపడ్డం, ఏదో – సంప్రదాయంనుంచి అలవాటుగా సంక్రమించిందంతే! ఒకే కులమైన మనలో ఈ శాఖల విషయం పక్కన పెట్టు. అసలు మొత్తం వ్యవస్థలో ప్రాముఖ్యం వహిస్తున్న కులాలే అర్థం లేనివని తేల్చిన ఆధునిక యుగమిది అని నాకూ తెలుసు. మనం వర్గ విభేదానికి అతీతులమైన భారతీయులమవాలి" అన్నాడతడు.

ఆ మాట మనసులోంచే వచ్చిందని తెలుస్తోంది కానీ, ఆ మాటల అంచున ఇంకా అపరాధభావముంది.

రచనావ్యాసంగంలో ఉన్న నాకు మనుషుల అంతరాంతరాల్లో ఉండే కులవివక్ష పట్ల కొంత అవగాహన ఉంది.

చాలామంది హిపోక్రసీతో బయటపడరు కానీ భోళా మనిషి సుందరం మనసుకు అనిపించిన మాట పైకి అనేశాడు. దాన్నిబట్టి అతడి వ్యక్తిత్వాన్ని అంచనా వేసే తొందరపాటు నాకు లేదు. ఎందుకంటే, అతడికి తనవాళ్లంటే ప్రత్యేకాభిమానం ఉండొచ్చు కానీ, అది తనవాళ్లు కానివాళ్లని అభిమానించడానికి అడ్డొచ్చేది కాదు. ద్వేషం, అసహనాల వంటివాటికి అతీతుడు కాకపోయినా – వాటికి కారణం కులాలు కాదు.

స్వతంత్ర భారతంలో ఓటు హక్కుని ఉపయోగించుకుంటున్న ఎందరో సామాన్యుల సామాన్యతకు అతడు ప్రతినిధి.

వాళ్లకు లేని అపరధభావం ఇతడికి ఎందుకుండాలి?

‘కులం జన్మతో రాదు. అది జీవనోపాధికి సంబంధించిన వృత్తితో ముడి పడింది’ – ఇది చిన్నప్పుడు బడిలో గురువులు చెప్పారు.

‘వృత్తులు అంతరించగానే కులవ్యవస్థ అర్థవిహీనమైంది’ – ఇది మన దేశంలో నిరక్షరాస్యుల దగ్గర్నుంచి, అత్యధిక విద్యాసంపన్నుల వరకూ, అందరికీ తెలుసు.

బడిలో పాఠాలనుంచి, గుడిలో ప్రవచనాలనుంచి, సామాజిక సభల్లో ఉపన్యాసాల వరకూ — మనమంతా భారతీయులమన్న ఘోష అదే పనిగా వినబడుతుంది.

కానీ – వ్యాపారం జోలికి వెళ్లని గాంధీజీని కోమటిగా, మంత్రాలు చదవని నెహ్రూని కాశ్మీరీ బ్రాహ్మణుడిగా — అనడం, అనుకోవడం మానం, మానలేం.

చివరకు పొట్ట చేతబట్టుకుని ఆధునిక సంపన్న దేశాలకు వెళ్లిన విద్యాధికులకి కూడా – ముందు కులం, ఆ తర్వాతనే దేశం. ఐతే వారిలో ఎవరికైనా – ఆ కులం ఆవిర్భావానికి మూలమైన వృత్తుల సంప్రదాయాలేమిటో నామమాత్రంగా తెలుసునా, తెలిసినా పాటిస్తున్నారా అంటే అనుమానమే!

సుందరం విద్యాధికుడు. శాస్త్రజ్ఞుడు. సంస్కారం ఉన్నవాడు.

అలాంటివాడు క్షణికమైన నిరాశలో, ‘చంపేశావ్ కదా!’ అని ఒకసారీ, ‘నెల రోజుల్లో, రెండోసారి దెబ్బ తిన్నాను’ అన్నాడంటే — అలనాడెప్పుడో సృష్టించిన ఈ కులవ్యవస్థ ఎంత ప్రభావశీలి!

సుందరం కులవ్యవస్థను కాపాడ్డానికే పుట్టాననుకోడు. కానీ హిపోక్రసీ తెలియని భోళా మనిషి.

మావాళ్లు, మనవాళ్లనే భావం అతడిలో ఏమూలో ఉండిపోయిన చిన్న బలహీనత.

తనకెంతగానో నచ్చిన నేను ఆ ‘మనవాళ్లలో’ ఒకణ్ణి కాదన్న నిరాశాభావం తాత్కాలికంగానే ఐతేనేం అతణ్ణి కుదిపేసింది.

ఇలా మనలో చాలామందికే జరుగుతుంది. బయటపడరు.

సుందరం అనుకోకుండా నోరు జారాడు. ఐతే అందుకు గర్వపడలేదు. ఇప్పుడు నేను నొచ్చుకున్నానేమోనని కలవరపడుతున్నాడు కూడా!

ఇప్పుడు నేను అతడి మాటలకు ప్రతికూలంగా స్పందిస్తే నొచ్చుకోడు సరికదా, సారీ కూడా చెబుతాడని నా నమ్మకం. కానీ ఆ అవసరం అతడికి రానివ్వకూడదని అప్పుడు నేననుకున్నాను.

ఎందుకంటే, గతంలో ఇలాంటి సందర్భాలు, అనుభవాలు చాలానే ఉన్నాయి నాకు. వాటిలో సుందరం స్థానంలో మహామహులున్నారు. నేను కూడా ఉన్నాను.

అతణ్ణి సముదాయించడం నా బాధ్యత. అందుకు గానూ, ఆ సందర్భాల్నీ, అనుభవాల్నీ ప్రస్తావించడం అవసరమని నాకనిపించింది.

కెఆర్ —

హైస్కూల్లో నా క్లాస్‌మేట్లలో బాగా సన్నిహితుడు. అతడిది కమ్మ కులం. గుడ్డు కూడా ముట్టని ఫక్తు శాకాహారి. మంచి బాలుడు అనతగ్గ అలవాట్లన్నీ ఉన్నాయి. ఏం తినాలన్నా ఇంటినుంచే తెచ్చుకునేవాడు తప్ప, బయట ఏం కొనుక్కుని తినేవాడు కాదు. చిరుతిళ్లకి ఎగబడే నన్ను, 'నువ్వేం బ్రాహ్మడివిరా' అని ఎగతాళి చేసేవాడు. నాకు కోపం వచ్చేది కాదు. తను నాకంటే ఓ ఏడాది పెద్ద కావడాన్ని అవకాశంగా తీసుకుని, 'సద్బ్రాహ్మణుడివంటే నువ్వురా, నీకులా ఉండడం నావల్లకాదు' అని చేతులు జోడించేవాణ్ణి. మా ఇంట్లో కూడా ఏ వేడుక జరిగినా విందు భోజనంలో మొదటి పంక్తిలో తనే ఉండేవాడు. అందుకు మావాళ్లు కొందరు చెవులు కొరుక్కునేవారు కానీ, మా నాన్నగారికి భయపడి పైకి ఏమనేవారు కాదు. తను కూడా, 'బ్రాహ్మలతో సావాసం, మునిగిపోతావ్' అని హెచ్చరించే తనవాళ్లని లెక్క చేసేవాడు కాదు. అతడి కులస్థుడే అధికారంలో ఉన్న ఓ సంస్థలో, అతడికి ఉద్యోగమివ్వడానికి మా నాన్నగారి సిఫారసు అవసరపడ్డం – మన వ్యవస్థలో అప్పుడప్పుడైనా జరిగే తమాషా!

మా మామగారు –

ఆయనవి విశాల భావాలు. కాకినాడలో బ్రాహ్మణ లాయర్లలో – నియోగి, వైదీకి ఫీలింగ్సు చాలా ఎక్కువగా ఉండేవని వాపోతూ ఉండేవారు. ఆయన మిత్రబృందంలో అన్ని కులాలు, శాఖలవారు ఉండేవారు. 'వాడు చెప్పిన పాయింటు గొప్పదే కానీ, చెప్పింది నియోగి (లేదా వైదీకి) కాబట్టి అది మనం వాడొద్దు' అన్న మాట వినాల్సి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయని బాధగా చెప్పేవారు.

వివి గారు –

నేను ఎమ్మెస్సీ ప్రీవియసులో ఉన్నప్పుడు కెమిస్ట్రీ డిపార్టుమెంట్లో రీడరు. మాకు ఆర్గానిక్ కెమిస్ట్రీ చెప్పేవారు. చాలా మంచి టీచరు. ఒకసారి నా రికార్డు పుస్తకం చూసిన ఆయన, 'వైదీకివా, నియోగివా?' అనడిగారు. నియోగినని చెప్పగానే, 'ఇలా వైదీకి పెంట చేశావేం?' అన్నారు. నా రికార్డు నీటుగా లేదని ఆయన ఉద్దేశ్యం. ఆయనలాగనడం నచ్చక, 'నియోగులకంటే వైదీకులకే శుభ్రమెక్కువంటారు కదా, మీరు నన్ను పొగిడినట్లా, తిట్టినట్లా?' అన్నాను. దానికాయన, 'వైదీకుల గురించి వైదీకినైన నాకంటే ఎక్కువ తెలుసా నీకు?' అని నవ్వేశారు. అంటే అదాయన మాట తరహాయే తప్ప, కుల/శాఖ వివక్ష కాదని నాకు అర్థమైంది.

కుల ప్రసక్తిలో ఆయన భోళాతనానికి అద్దం పట్టే సంఘటన ఆ తర్వాత రెండేళ్లకు జరిగింది.

ఎమ్మెస్సీ ఐపోయేక సుబ్రహ్మణ్యం అనే నా క్లాస్‌మేటుకి రీసెర్చి చెయ్యడానికి నూటయాభై రూపాయల స్కాలరుషిప్పొచ్చింది. అందుకు గైడ్ సంతకం కావాలని అతగాడు వివి గార్ని కలిశాడు. ఆయన అతడితో, 'ఒరేయ్, కోమటాడివి. వ్యాపారం చేసుకుని బ్రతికెయ్యగలవు. నీకు రీసెర్చి ఎందుకురా? ఈ స్కాలరుషిప్పుని వేరెవరికైనా వదిలేయొచ్చుగా' అన్నారట. అప్పట్లో అన్ని కులాల స్నేహితులం ఒకరి కులం మీద ఒకరు జోకులేసుకునేవాళ్లం. హాస్యమే తప్ప ఎగతాళికి అవకాశం లేకుండా, ఎంజాయ్ చేసేవాళ్లం. నేటి రోజుల్లో అయితే వివి గారి మాటలు కులదూషణగా, అహంకారంగా గుర్తించబడి పెద్ద దుమారం లేపేవి. అప్పటి అవగాహనలో మా సుబ్రహ్మణ్యం ఆయన సలహా పాటించి ఆ స్కాలరుషిప్పు వదులుకున్నాడు. వ్యాపారమైతే చెయ్యలేదు కానీ, తన ఊరికి దగ్గర్లో లెక్చరరుగా చేరిపోయి సంతోషంగా ఉన్నాడు. ఇప్పటికీ వివి గారి మాటల్ని తన మిత్రులతో పంచుకుని ఎంజాయ్ చేస్తుంటాడు.

దేవానంద్ –

ఇది అతడి అసలు పేరు కాదు. ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు నేను, మా అన్నయ్య చినవాల్తేర్లో గది తీసుకుని ఉండేవాళ్లం. మాకు పక్కనే ఆనర్స్ చదివే ఓ కుర్రాడు ఉండేవాడు. అంతెత్తు మనిషి. పచ్చని ఛాయలో మిసమిసలాడిపోతూ సినిమా హీరోలా ఉండేవాడు. నేనతణ్ణి దేవానంద్ అనేవాణ్ణి. ఆ పేరే నాకు గుర్తుండిపోయింది. అతడు నాతో, 'ఎంత పెర్సనాలిటీ ఉన్నా, మేం చెంబుగాళ్లమండీ! రాజసంలో మేం మీ నియోగుల తర్వాతే!' అనేవాడు.

అతడి పెర్సనాలిటీ ముందు చాలామంది సినీహీరోలే చిన్నబోతారు. అతడిముందు పిట్టలా ఉండే నాలో రాజసాన్ని చూడ్డంవల్ల, నాకు ఒరిగిందేం లేదుకానీ, అతడిలోని రాజసం రెట్టింపయింది.

ఆశ్చర్యమేమంటే అప్పట్లోనూ ఇప్పటిలాగే విద్యార్థులకి కూడా శాఖలతో సహా కులాలు తెలిసినా – అహాలు, చిన్నతనాలు ఉండేవి కాదు.

శామ్యూల్ –

ఎమ్మెస్సీలో క్లాస్‌మేట్. భావా సాన్నిహిత్యం వల్ల నాకు బాగా దగ్గర స్నేహితుడు.

ఫైనలియర్లో ప్రాక్టికల్ పరీక్షలు రాసేముందు ఆర్గానిక్ కెమిస్ట్రీ హెడ్ ఫ్ ది డిపార్టుమెంట్ గా ఉండేవారు ఎల్లాప్రగడ రావు గారు. ఆయన మొత్తం కెమిస్ట్రీ డిపార్టుమెంటుకి హెడ్ కావచ్చునని నా మరో క్లాస్‌మేట్ మూర్తికి తెలిసింది. అతడికి చెప్పలేనంత ఉత్సాహం వచ్చి, 'ఇది నీతో తప్ప ఇంకెవరితో పంచుకోను? ఎల్లాప్రగడ రావుగారు మనవాళ్లే! మనకి డిపార్టుమెంట్లో మంచి భవిష్యత్తుండొచ్చు' అన్నాడు నాతో.

నిజం చెప్పొద్దూ, నాకూ సంతోషంగా అనిపించింది. ఆ మాట శామ్యూల్ కి చెప్పి నా ఆనందాన్ని పంచుకోబోయాను. శామ్యూల్ వెంటనే, 'కుర్రాడా, ఆ మూర్తి సంగతి సరే, తనకి తగ్గట్లే మాట్లాడేడు. కానీ నువ్వు కూడా.....'' అని మందలించాడు.

అప్పటికే రచనావ్యాసంగంలో ప్రవేశించి, కులవ్యవస్థను కనీసం మానసికంగానైనా నిరసించాలనుకుంటున్న నాకు – బలహీన క్షణాల ప్రభావం తెలిసింది. శామ్యూల్ దగ్గర తల దించుకున్నాను

మిత్రుల దగ్గర – కులం, శాఖల ప్రసక్తి ఆ విధంగా తీసుకురావడం జీవితంలో అదే చివరిసారి!

బీఎల్ –

ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేస్తుండగా – యూనివర్సిటీ కాంపస్ వెనుక, విద్యానగర్లో ఓ గది తీసుకుని కొందరు స్కాలర్లం కలిసి ఉండేవాళ్లం. కలిపి ఓ క్యారియరు తెప్పించుకుని కలిసి భోంచేసేవాళ్లం. నా రూంమేట్లలో ఎన్నటికీ మరువలేని ఇద్దరిలో ఒకడు బీఎల్.

బీఎల్ ఎమ్మే సోషల్ వర్క్ చదివి పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఘంటసాలలా ఖంగుమనే స్వరంలో చాలా గొప్పగా పాడతాడు. బాగా డబ్బుంది. కులానికి కాపు. చెయిన్ స్మోకరు. రోజూ పేకాడేవాడు. మిత్రులతో కలిసి తాగడానికి అభ్యంతరం లేదు. తన అలవాట్లలో వేటినీ అతడు నామీద రుద్దే ప్రయత్నం చెయ్యలేదు. అతడిలోని గొప్ప లక్షణాలేంటంటే, అవసరంలో ఉన్నవారిని అడక్కపోయినా కూడా ఆదుకుంటాడు. ఆ విషయమై ఏమాత్రం ప్రచారం చేసుకోడు, చెయ్యడాన్ని ఇష్టపడడు. ఎవరివల్లనైనా తనకి అపకారం జరిగితే ఆ విషయం ఎవరివద్దా ప్రస్తావించడు. ఎవరైనా ప్రస్తావిస్తే మాట తప్పిస్తాడు. తనని మోసగించేవారూ ఎక్కువే. పదే పదే మోసగించి సాయమడిగినా, అవగాహనతో సాయం చెయ్యాలనుకుంటాడు తప్ప నిరసించడు. తన కులం గురించి, 'రిజర్వేషను కావాలంటే కొండకాపులం. వద్దనుకుంటే కాపులం. డబ్బుంది కాబట్టి నాయుళ్లం. ఐతే నాయుళ్లు చాలా రకాలు. నాయుళ్లంటే నానా జాతి సమితి అని ఎద్దేవా చేసేవారూ ఉన్నారు' అని నవ్వుతూ చెప్పేవాడు.

అలవాట్ల విషయం పక్కన పెడితే, వ్యక్తిగా ఉత్తమ లక్షణాలకీ, ఉన్నత సంస్కారానికీ అతడే నాకు ఆదర్శం. నేడు ఎవరైనా నాలో మెచ్చుకోతగ్గ సంస్కారాన్ని చూస్తే, ఆ ఘనతలో సింహభాగం ఆ సజ్జనుడి సాంగత్యానిదే!

అర్జన్న –

రీసెర్చి కాలంలో బీఎల్ తో పాటు మరో రూంమేట్ ఇతడు. ఎమ్మే యాంత్రోపాలజీ చదివి రీసెర్చి చేస్తున్నాడు. అంటరానిదిగా వివక్షకు గురైన కులానికి చెందిన దళితుడు. సంగీతప్రియుడు. జ్ఞాని, లోకజ్ఞాని. ఆవేశం, భావోద్వేగాలకు కాకుండా – ఆలోచనకూ, తర్కానికీ పెద్ద పీట వేసే అతడి అవగాహన నాకతణ్ణి సన్నిహితుణ్ణి చేసింది. దళితులకి ఆర్థికంగా సాయపడాలి తప్ప, మెరిట్ విషయంలో రిజర్వేషను తగదనుకునే నాకు – అతడి వివరణ విన్నాక, అభిప్రాయం మారింది. అతడికి బ్రాహ్మణుల పట్ల ఉన్న గౌరవం, సానుభూతి – నాకు

ఆశ్చర్యంగా అనిపించేది. బ్రాహ్మణులు సమాజానికి జ్ఞానాన్ని పంచారనీ – ధనానికీ, పదవికీ దూరంగా ఉండేవారనీ అనేవాడు. బ్రాహ్మణులవల్ల ఆధునిక వ్యవస్థలో ఇతర కులాలకి ఎక్కువ మేలు జరిగిందనీ, బ్రాహ్మణులు దళితులకంటే కూడా ఎక్కువ నష్టపోయారనీ అనేవాడు. శతాబ్దాలుగా చేసిన జ్ఞానసాధనే బ్రాహ్మణుల్ని ఇప్పటికీ పూర్తిగా వెనుకబడిపోకుండా కాపాడుతోందనేవాడు. మిగతా కులాలవారు ఈ విషయం గ్రహించి – ధనము, హోదాకంటే జ్ఞాన సముపార్జనకే ప్రాధాన్య మివ్వకపోతే - వారికి పతనం తప్పదనేవాడు. ప్రతి విషయాన్నీ అన్ని కోణాలనుంచీ తార్కికంగా ఆలోచించే అతడి సాహచర్యంలో, లౌకికంగా ఎన్నో కొత్త విశేషాలు తెలుసుకున్నాను. ఆ సాహచర్యం నా మానసిక వికాసానికీ, పరిణతికీ ఎంతో సహకరించింది.

ఎంవీ, ఎస్వీ

వీరిద్దరూ వ్యక్తిగతంగా నాకు తెలియరు. కానీ రీసెర్చి రోజుల్లో వీరి కథ మా సర్కిల్లో బాగా ప్రచారంలో ఉండేది.

ఎంవీ దళితుడే కానీ కలిగినవాడు. ఎస్వీది అగ్రకులమే కానీ పేదవాడు. ఇద్దరూ కాకినాడలో ఒకే స్కూల్లోనూ, తర్వాత ఒకే కాలేజిలోనూ చదివారు. మంచి మిత్రులే కానీ వారి మధ్య కులాల విషయమై తరచుగా పోట్లాటలు జరిగేవి. వారి స్నేహానికి అసూయ పడ్డ సహాధ్యాయులు ఆ గొడవల్ని పురస్కరించుకుని – అగ్నికి ఆజ్యం పోసి వాళ్ల మధ్య శత్రుత్వాన్ని పెంచాలని ప్రయత్నించేవారు. అప్పుడు ఎస్వీ, 'శతాబ్దాలుగా అణగద్రొక్కబడ్డ కులం వాడిది. కడుపు మండి ఓ మాటంటే తప్పు లేదు' అనేవాడు. ఎంవీ, 'వాడి పూర్వీకులు ఏదో చేశారని, వాణ్ణి ఏదో అనడం నా తప్పు. అందుకు వాడు రియాక్టయితే అది సహజమే కదా!' అనేవాడు. 'ఇన్ని కబుర్లు చెబుతారు, మరెందుకు పోట్లాడుకుంటారు?' అనడిగితే – 'ఏం, అన్నదమ్ములు పోట్లాడుకోరా?' అని తేల్చేసేవారు.

ఎంవీ తెలివైనవాడే కాదు. పౌరుషం ఎక్కువ. రిజర్వేషన్లో కాక మెరిట్ తోనే పైకి రావాలనుకున్నాడు. ఐనా అతడు మెరిట్ స్కాలరుషిప్పు కోసం రిజర్వేషన్ బాట పట్టాడు. ఎందుకంటే పేదవాడైన ఎస్వీ తన చదువు కొనసాగించడానికి ఆదుకోవాలని!

ఎమ్మెన్నెస్

ఈయన నా పీహెచ్‌డీ గురువు. ఆయన వ్యక్తిత్వం అసాధారణం. యూనివర్సిటీలో ప్రొఫెసర్లు నియంతలుగా వ్యవహరించే రోజుల్లో – ఆయన శిష్యులతో బాల్యస్నేహితుడిలా వ్యవహరించేవాడు. సున్నితమైనవి అనిపించే ఎన్నో సందర్భాల్ని, సమయస్ఫూర్తితో ఎలా తేలిక చెయ్యవచ్చో ఆయన్ని చూసి నేర్చుకోవాలి. అందుకాయన్ని అభినందిస్తే, 'ముందు మనసులోంచి కుళ్లు తీసేయాలి. అప్పుడే ఏ విషయంలోనైనా మన ప్రయత్నాలు ఫలిస్తాయి' అనేవారు. ఒకసారి ఆయన తన గదిలో కొలీగ్సుతో మాట్లాడుతుండగా కులాల ప్రసక్తి వచ్చింది. ఆ సమయంలో నేనాయన్ను కలుసుకోవాల్సి వచ్చింది. వాళ్ల మాటలు బయటకు వినబడుతుండడంవల్ల కొంచెం తటపటాయిస్తూనే లోపలకు వెళ్లాను. గురువు గారు నా తడబాటు గుర్తించారో ఏమో, చటుక్కున నాతో, 'ఏమయ్యా! నా శిష్యుల్లో నియోగులెక్కువైపోయారని 'మావాళ్లు' గోలెడుతున్నారు. ఎవరైనా ఒకరిద్దరు మానేసి వెళ్లిపోతే ఈ అపవాదు పోతుందేమో' అన్నారు. ఏమనాలో తెలియకపోయినా ఆయన దగ్గర ఏర్పడిన చనువుతో, 'ఈ మాట నాకేమైనా సూచనా?' అన్నాను. ఆయన వెంటనే, 'అరే, నువ్వు నియోగివి కదూ! మర్చేపోయాను. ఐనా నువ్వేం నియోగివయ్యా! నియోగంటే బుర్రలు తీసి బుర్రలు మార్చాలి. మావాళ్లెవరి దగ్గరా నియోగినని అనకు. వాళ్లు నిన్ను మావాడివే అనుకుంటున్నారు' అన్నారు. అంతా హాయిగా నవ్వుకున్నాం.

కులాలతో సహజీవనం చేస్తున్నప్పుడు వాటి గురించి ఇలా సరదాగా మాట్లాడుకోగలిగితే – మనుషులమధ్య వైషమ్యాలుండవు.

నేడా స్ఫూర్తి లేదు.

చిలకమర్తి వారు పేరుపేరునా కులాల్ని ప్రస్తావించి ఎన్నో ప్రహసనాలు అందించారు. ఇప్పుడైతే జనం ఆ పుస్తకాల్ని తగలెడతారేమో మరి!

సుందరంతో ఇలాంటి విశేషాలు ఎన్నో పంచుకునేసరికి, అతడు పూర్తి నార్మల్ అయ్యాడు.

"మిగతా కులాల సంగతి ఎందుకు గానీ, నన్నయ కాలం దాకా బ్రాహ్మణుల్లో ఇన్ని తెగలు లేవు. అందరూ వైదీకులే! ఆ తర్వాత కాలక్రమేణా, శాఖోపశాఖలు వచ్చాయి. అధికారం లేక బ్రాహ్మణులకి బొత్తిగా విలువ లేకుండా పోయిందని – వైదీకుల్లో కొంతమందిని రాజులవద్ద మంత్రులుగా ఉండమని నియోగించారు. వారు నియోగులయ్యారు. వారిలో ఒక్కసారి ఆరువేలమందిని గ్రామాధికారులుగా నియమిస్తే వారు ఆరువేల నియోగులయ్యారు" అంటూ అతడు బ్రాహ్మణుల మూలాలు కొన్ని వివరించాడు కూడా.

వాతావరణం తేలికయింది. క్రమంగా టాపిక్సులో కులాలు పక్కకెళ్లి – జాతీయ, అంతర్జాతీయ సమస్యలు కూడా చొరబడ్డాయి.

డాడ్ సంస్థ పేరు చెప్పి – మేము ఒకరికొకరు పరిచయమైన అదృష్టం మా సంభాషణలో చివరి అంశం.

సుందరం వెళ్లిపోయాడు.

ఆతర్వాత కూడా మా ఇద్దరిమధ్యా పూర్వపు అనుబంధం ఎప్పటిలాగే కొనసాగింది.

పండుగ రోజుల్లో ఏ పులిహోరో భారీ ఎత్తున చేసినప్పుడు, పొరపాటున ఏ కిరసనాయిలో నాలుగు చుక్కలు చింది దానిమీద పడితే, అది గమనించినవారు చటుక్కున ఆ చుక్కలు పడిన మేరకు పదార్థాన్ని జాగ్రత్తగా పక్కకు తొలగించి, మిగతాది వాడుకోవడం చాలా మధ్యతరగతి ఇళ్లలో మామూలే. అలాంటి సందర్భాల్లో ఆ విషయం తెలియనివారికే కాదు, తెలిసినవారికీ, మిగతా వంటకంలో కొంత భాగానికి కిరసనాయిలు తగిలిందన్న విషయమే స్ఫురించదు.

జీవితంలో అనుకోకుండా జరిగిన అవాంఛిత సంఘటనల్ని అలా పక్కన పెట్టడం అలవాటు చేసుకుంటే, మనుషులమధ్య వైషమ్యాలే ఉండవనడానికి సుందరానికీ నాకూ కొనసాగిన అనుబంధం ఒక నిదర్శనం.

జర్మనీలో ఇతర ప్రాంతాల్లో ఉంటూ, ఇలా బెర్లిన్లో నన్ను చూడవచ్చినవారు మరికొందరున్నారు. అవసరాన్నిబట్టి వారిని సందర్భాను సారంగా ప్రస్తావిస్తాను. ఇక బెర్లిన్లో మాకు సన్నిహితులైన కొందరితో పంచుకోతగ్గ అనుభవాలు, అనుభూతులు ప్రస్తావిస్తాను.

బెర్లిన్ మిత్రులు

వీరిలో మొదట చెప్పుకోవాల్సిన వ్యక్తి ఎస్ ఎస్ రావు.

రావుగారు సీమెన్సులో ఇంజనీరు. చాలా ఏళ్లుగా బెర్లిన్లో ఉంటున్నాడు. వయసులో నాకంటే పదేళ్లకి పైనే పెద్దవాడు.

అతడికి ఇద్దరు పిల్లలు. పెళ్లి ఆలస్యంగా అయిందేమో, ఇద్దరూ మాబాబు కంటే కూడా చిన్నవాళ్లు.

ముందు ఒక బాబు, రెండేళ్లుంటాయి. తర్వాత పాప. ఉయ్యాల్లో బిడ్డ.

చిత్రమేమిటంటే – అతడితో మా పరిచయానికి కారణం ఓ పోస్టు కార్డు.

ఆ కార్డులో సమాచారం అంత ముఖ్యమైంది కాదు. ఎటొచ్చీ, ఆ కార్డుమీద అడ్రసులో మా ఇంటి నంబరు తప్పుగా వేశారు. అప్పటికే నా పేరిట తరచుగా ఉత్తరాలు వస్తున్నా, అక్కడ పేరుకంటే ఇంటి నంబరుకే ప్రాధాన్యం ఉండడంవల్లనేమో, ఇల్లు దొరక్క తికమక పడ్డాడు పోస్టుమన్. చివరికి తప్పనిసరై ఉత్తరం ఎవరికా అని పేరు చూస్తే, నా పేరు కనబడింది.

రావు పేరు చూడగానే పోస్టుమన్ కి, ఎస్ ఎస్ రావు గారు గుర్తుకొచ్చాడు. అతడి ఇల్లు మా ఇంటికి కిలోమీటరు దూరంలో ఉండే క్నెసెబెకే స్ట్రాసేలో ఉంది. రావుగారు చాలా ఏళ్లుగా అక్కడుంటున్నందువల్ల, పోస్టుమన్ కి ఆ పేరు సుపరిచితమై ఉండొచ్చు. రావుకి రావు బంధువు కాకపోదులే అనుకుని, ఉత్తరం ఎలాగైనా అసలు మనిషికి చేరాలన్న తపనతో కాబోలు, ఆ ఉత్తరాన్ని అతడికిచ్చాడు.

తనది కాని ఉత్తరాన్ని లెటరుబాక్సులో చూసుకున్న రావుగారు, మామూలుగా ఐతే ఏం చేసేవాడో! కానీ, అడ్రసుమీద తెలుగు పేరు చూడగానే అతడికి మనసు పీకింది. ఎలాగైనా ఆ ఉత్తరం నాకు చేరేయాలనిపించి, అడ్రసుమీద నంబరు పట్టుకుని వెడితే, అక్కడ పూర్తిగా కూలగొట్టబడిన ఇల్లొకటి కనిపించింది. చుట్టుపక్కల వాకబు చెయ్యగా, చాలాకాలంగా ఆ ఇంట్లో ఎవరూ ఉండడం లేదనీ, ఇటీవలే ఎవరో కొనుక్కున్నారనీ, కూలగొట్టి కొత్త ఇల్లు కట్టబోతున్నారనీ తెలిసింది.

దాంతో అతడు, 'ఎవరీ తెలుగు రావు? కూలగొట్టబడిన ఆ ఇంటి స్థలంతో ఈ రావుకి అనుబంధం ఎలా ఏర్పడింది?' అని కాసేపు మథన పడ్డాడు. తర్వాత, 'కొంపదీసి ఇక్కడ ఇల్లు కూలగొట్టి కొత్తిల్లు కట్టబోతున్నది తనే కాదు కదా!' అని అనుమానించాడు...

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments